గత ప్రభుత్వాల తప్పిదాలతోనే అభివృద్ధి శూన్యం



మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

సుభాష్‌నగర్: హైదరాబాద్ నగరానికి పట్టుకొమ్మగా ఉన్న మేడ్చల్ అర్బన్ జిల్లా గత ప్రభుత్వాల తప్పిదాలతో అభివృద్ధిలో ముందుకు సాగలేదని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. శనివారం గాజులరామారంలో జరిగిన బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైన మాట్లాడారు. మేడ్చల్ అర్బన్ జిల్లా పరిధిలో ఇండస్ట్రియల్ కారిడార్లు, కాలేజీలు, యూనివర్సిటీలు ఉన్నా తగిన సదుపాయాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, హైదరాబాద్ మెట్రోరైలు ఈ ప్రాంతానికి విస్తరిస్తే మరింత అభివృద్ధి సాధ్య పడుతుందన్నారు. ఇప్పటికే ఉన్న ఎంఎంటీఎస్ సర్వీసులు ఇంకా పెంచాల్సి ఉందని, ఫ్లై ఓవర్లు, రోడ్లను విస్తరించాల్సి ఉందని, వీటన్నింటిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించి జిల్లా అభివృద్ధికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్, జిల్లా ఇన్‌చార్జ్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి, గాజులరామారం కార్పొరేటర్ రావుల శేషగిరి, జిల్లా ఉపాధ్యక్షులు బక్క శంకర్‌రెడ్డి, బావిగడ్డ రవి, గరిగే శేఖర్, గిరివర్ధన్‌రెడ్డి, నరహరి తేజ, విఘ్నేశ్వర్, శేఖర్ యాదవ్, శివాజీరాజు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్క నాటి నీరు పోస్తున్న కూన శ్రీశైలంగౌడ్

సుభాష్‌నగర్: పుట్టినరోజున ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పెంపొందించాలని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. శనివారం గాజులరామారంలోని ఎస్‌వీఆర్ గ్లోబల్ హైస్కూల్‌లో జరిగిన వనమహోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై పాఠశాల చైర్మన్ సొంటిరెడ్డి పున్నారెడ్డితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ.. పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టడానికి మొక్కలు నాటడమే శరణ్యమని, ప్రతి ఇంటి ముందు రెండు మొక్కలు నాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో రషీద్ బేగ్, లాల్ మహమ్మద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దూలపల్లిలో రైతు రుణమాఫీ సంబరాలు



రుణమాఫీ రసీదును అందజేస్తున్న నరేందర్ రాజు

సుభాష్‌నగర్: రైతు రుణమాఫీ డబ్బులు అందడంతో శనివారం దూలపల్లిలోని పీఏసీఎస్ సంఘ రైతులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ చైర్మన్ గరిసే నరేందర్‌రాజు, బ్యాంక్ మేనేజర్ కృష్ణ, మెంబర్లతో కలిసి రైతులకు రుణమాఫీ రసీదులను అందజేశారు. అనంతరం నరేందర్‌రాజు మాట్లాడుతూ.. సంఘంలో 109 మంది రైతులు ఉండగా రూ.57,09,551 పంట రుణాలు తీసుకున్నారని, వారందరికీ రుణమాఫీ వర్తించనుందన్నారు. అలాగే మొదటి విడతలో 51 మంది రైతులకు రూ.19,67,317 వచ్చాయన్నారు.మిగతా వారికి త్వరలో రానున్నట్లు తెలిపారు. వ్యవసాయం నమ్ముకొని ఉన్న రైతులు రాష్ట్ర ప్రభుత్వానికి రుణపడి ఉంటారన్నారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి రైతులతో కలిసి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ రవీందర్‌రెడ్డి డైరెక్టర్లు సత్యనారాయణ, నరేందర్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో కూల్చివేతలు

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ మహాదేవపురంలోని పార్కులో వెలిసిన నిర్మాణాన్ని కూల్చివేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ విజిలెన్స్ డిజాస్టర్ మేనేజ్మెంట్ కమిషనర్ రంగనాథ్ ఆదేశాలు జారీ చేసినా అధికారులు తూతూమంత్రంగా కూల్చివేతలు చేపట్టడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెల 15న స్వయంగా కబ్జాకు గురైన పార్కులను పరిశీలించిన ఆయన పార్కు స్థలంలో వెలిసిన నిర్మాణాలను కూల్చివేయాలని ఆదేశాలు జారీ చేశారు. అయితే.. సంబంధిత అధికారులు తూతూ మంత్రంగా కూల్చివేతలపై కాలనీవాసులు శనివారం మరోసారి కమిషనర్ రంగనాథ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన అధికారుల తీరుపై మండిపడ్డారు. పార్కు స్థలంలో వెలిసిన ఆ భవనాన్ని నేల మట్టం చేయాలని ఘాటుగా చెప్పడంతో శనివారం సాయంత్రం కూల్చివేతలు చేపట్టారు.

బోనాల చెక్కుల పంపిణీ



చెక్కులను పంపిణీ చేస్తున్న బీర్ల ఐలయ్య

జగద్గిరిగుట్ట : జగద్గిరిగుట్ట లక్ష్మి వేంకటేశ్వర స్వామి దేవస్థాన ప్రాంగణంలో శనివారం బోనాలు ఉత్సవాలకు సంబంధించిన చెక్కులను ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య చేతుల మీదుగా పంపిణీ చేశారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం మొత్తం 106 దేవాలయాలకు చెక్కులను అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జగన్, మంత్రి సత్యనారాయణ, దేస్థాన చైర్మన్ వేణు యాదవ్, ఈఓ కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు చోరీ చేస్తున్న ముఠా రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సురేష్‌కుమార్

జీడిమెట్ల: ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న ఓ ముఠాను బాలానగర్ సీసీఎస్, జీడిమెట్ల పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. షాపూర్‌నగర్‌లోని బాలానగర్ డీసీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ సురేష్‌కుమార్ వివరాలను వెల్లడించారు. సంగారెడ్డి జిల్లా సింగూరుకు చెందిన మహ్మద్ ఇస్మాయిల్ విజయవాడలో ఓ గదిని అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. ఇస్మాయిల్ సులువుగా డబ్బులు సంపాదించేందుకు ద్విచక్ర వాహనాల దొంగతనానికి పాల్పడేవాడు. నగరంతో పాటు విజయవాడ, కృష్ణలంక తదితర ప్రాంతాల్లో మొత్తం 36 వాహనాలను దొంగిలించాడు. వాటిని జగద్గిరిగుట్ట చంద్రగిరినగర్‌కు చెందిన మహ్మద్ ఖురేషా బాబా, సంగారెడ్డి జిల్లా పుల్కల్‌కు చెందిన పెద్ద కటిక సోహెల్, అదే జిల్లా జోగిపేటకు చెందిన మంగళి షామ్, సూర్యపేట జిల్లా కోదాడకు చెందిన షేక్ హుస్సేన్‌కు తక్కువ ధరకు విక్రయించేవాడు. శుక్రవారం చింతల్ హెచ్‌ఎంటీ రోడ్డులో బాలానగర్ సీసీఎస్, జీడిమెట్ల పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా ద్విచక్ర వాహనంపై వచ్చిన మహ్మద్ ఇస్మాయిల్‌ను ఆపి పత్రాలు అడగగా సరైన సమాధానం చెప్పలేదు. స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించగా వాహనాల దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నాడు.అతనితో పాటు వాహనాలు కొనుగోలు చేసిన వారిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి 25 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ సమావేశంలో సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రాజు, జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ మల్లేష్, ఎస్సై అంజనేయులు, సీసీఎస్ ఎస్సై పోచయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ బంగారం విక్రయించేందుకు యత్నం

ముగ్గురి రిమాండ్



పోలీసులు స్వాధీనం చేసుకున్న నకిలీ బంగారం, డబ్బు

జీడిమెట్ల: తక్కువ ధరకే బంగారం విక్రయిస్తామంటూ ప్రజలను మోసం చేస్తున్న ముగ్గురు వ్యక్తులను బాలానగర్ ఎస్‌ఓటీ, జీడిమెట్ల పోలీసులు రిమాండ్‌కు తరలించారు. షాపూర్‌నగర్‌లోని బాలానరగ్ డీసీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అదనపు డీసీపీ సత్యనారాయణ ఎస్‌ఓటీ అదనపు డీసీపీ శోభన్, ఇన్‌స్పెక్టర్ మల్లేష్‌తో కలిసి డీసీపీ సురేష్‌కుమార్ వివరాలు వెల్లడించారు. ఉప్పల్‌కు చెందిన యాశల కామేశ్వర్‌రావు అలియాస్ వొల్లకంటి రాజా, అలియాస్ మహేష్, గుంటూరు జిల్లాకు చెందిన వేముల పుల్లారావు, పల్నాడు జిల్లాకు చెందిన బత్తుల కోటేశ్వరరావు ముగ్గురు ఓ ముఠాగా ఏర్పడి విజయవాడలో 20 గ్రాముల నకిలీ బంగారు నాణేలను తయారు చేయించారు. తమవద్ద బంగారు నాణేలు ఉన్నాయని మార్కెట్ ధర కన్నా రూ.10 వేలు తక్కువకు ఇస్తామంటూ కామేశ్వరరావు తెలిసిన వారికి చెప్పుకున్నారు. ఈ విషయం వికారాబాద్ జిల్లా తాండూర్‌కు చెందిన అంజలికి తెలిసింది. ఆమె కోటేశ్వరరావు ఫోన్‌చేసి బేరం మాట్లాడుకున్నారు. బంగారం కావాలంటే నేవారిని షాపూర్‌నగర్‌లోని శుభం హోటల్‌కు రావాలని కోటేశ్వరరావు తెలిపాడు. దీంతో అంజలి తనకు తెలిసిన భానురేఖ, ప్రభావతి ఓ గోల్డ్‌స్మిత్‌తో కలిసి షాపూర్‌నగర్ రూ.28.5 లక్షలను తీసుకొచ్చారు. కొనుగోలు జరుగుతున్న సమయంలో ఓ వ్యక్తి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు నకిలీ బంగారు నాణేలు ఉన్నట్లు గుర్తించి ముగ్గురిని రిమాండ్ తరలించారు.

పనులకు తూట్లు.. బురదగా రోడ్లు



సూరారం డివిజన్ శ్రీరామ్‌నగర్‌లోని తిరుమల ఎన్‌క్లేవ్ రోడ్డు

వివిధ కారణాలతో ఆగిపోయిన పనులతో పాటు ఎన్నికల ముందు కాంట్రాక్టర్లు తమ బిల్లులు చెల్లించాలని అభివృద్ధి పనులు ప్రారంభించకపోగా ఇప్పటివరకు అవి కార్యరూపం దాల్చలేదు.. దీంతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని కొంపల్లి, దుండిగల్, మున్సిపాలిటీతో పాటు నిజాంపేట్ నగర కార్పొరేషన్, గాజులరామారం, కుత్బుల్లాపూర్ జంట సర్కిళ్ల పరిధిలో సుమారు కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. దీంతో ఇటీవల కురుస్తున్న వర్షాలతో ప్రధాన రోడ్లన్నీ బురద మయంగా మారి ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు పనులు చేయకపోవడంతో రూ. 70 కోట్ల విలువ చేసే 55 పనులకు తిరిగి టెండర్లు పిలువగా ఇందులో రూ. 23 కోట్ల విలువ చేస్తే 39 పనులకు అనుమతి లభించడంతో కాంట్రాక్టర్లకు వర్కార్డర్లు జారీ చేశారు. కాంట్రాక్టర్లు గతంలో చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో చేతులెత్తేశారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఆయా కాలనీలో ఇలా రోడ్లన్నీ అధ్వానంగా మారడంతో రాకపోకలకు తీవ్ర ఇక్కట్లు పడుతున్నామని ఆయా ప్రాంతాల వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. -కుత్బుల్లాపూర్



పేట్‌బషీరాబాద్ ఉడ్స్ కాలనీ ప్రధాన రోడ్డు ఇలా..



గుంతలమయంగా నూజివీడు సీడ్స్ కంపెనీ నుంచి దూలపల్లికి వెళ్లే రోడ్డు



శ్రీపొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం రోడ్డులో ఇలా..



అయోధ్యనగర్ రోడ్డు-34లో నడిచేందుకు వీలు లేకుండా ఉన్న రోడ్డు

ఉద్యమకారులను స్వాతంత్ర్య సమరయోధులుగా గుర్తించాలి



కోదండరామ్‌కు వినతి పత్రం ఇస్తున్న సంఘం నాయకులు

కుత్బుల్లాపూర్: తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొన్న ఉద్యమకారులను తెలంగాణ స్వాతంత్ర్య సమరయోధులుగా గుర్తించాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఉద్యమకారుల సంఘం ఆధ్వర్యంలో శనివారం ప్రొఫెసర్ కోదండరామ్‌ను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు ముదిరెడ్డి అశోక్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రం వచ్చి పదేళ్లు కావస్తున్నా ఉద్యమకారులకు న్యాయం జరగడం లేదన్నారు. ఉద్యమకారులకు 250 గజాల ఇళ్ల స్థలం, పింఛన్, ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి, ప్రభుత్వ గుర్తింపు కార్డు అందజేయాలన్నారు. వినతి ఇచ్చిన వారిలో డీఎస్ నర్సింహులు, బి.కృష్ణారెడ్డి, నాగిరెడ్డి, గౌస్ పాషా, సలీమ్, జి.మధుసూదన్, రామిరెడ్డి, రవీందర్ గుప్తా, యాదగిరి, శ్రీనివాస్, రామస్వామి పాల్గొన్నారు.

మండల్ కమిషన్ సూచనలను అమలు చేయాలి

రాయదుర్గం: 'మండల్ దివాస్' కార్యక్రమాల నిర్వహణకు ఆగష్టు 7వ తేదీన 'చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించినట్లు ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఓబీసీఎస్ఏ) జాతీయ అధ్యక్షుడు కిరణ్‌కుమార్ శనివారం తెలిపారు. ముఖ్యంగా మండల్ కమిషన్ సూచనలను అమలు చేయాలని, కుల గణన చేయాలని, 52 శాతం ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉన్నత విద్యాసంస్థలలో రిజర్వేషన్లను పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. నేషనల్ ఫెలోషిప్స్‌ను ఓబీసీలకు రూ.1000 నుంచి రూ.5వేలకు పెంచాలని డిమాండ్ చేస్తూ 'చలో ఢిల్లీ'ని నిర్వహిస్తామని ఆయన వివరించారు. కార్యక్రమంలో ఓబీసీలంతా పాల్గొనాలని ఆయన కోరారు.

నేడు చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో 'గురుపూర్ణిమ'

రాయదుర్గం: గురుపూర్ణిమను పురస్కరించుకొని గచ్చిబౌలి జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని రాజరాజేశ్వరి సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉదయం 6 గంటకు కాగడ హారతితో వేడుకలను ప్రారంభిస్తారు. దత్తాత్రేయస్వామికి ప్రత్యేక పూజలు, సంప్రోక్షణ కార్యక్రమం, పుష్పార్చన, సాయిచాలీసా కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనంతరం అన్నప్రసాద వితరణ ఉంటుంది. సాయంత్రం సంధ్యా హారతి, పల్లకిసేవ, ఊయల సేవ, శేజ్ హారతితో వేడుకలను ముగిస్తారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



గ్రీన్‌డే లో పాలొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

రంగారెడ్డినగర్: పర్యావరణాన్ని రక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ చెట్లను నాటాలని డీసీసీ మాజీ అధ్యక్షుడు కేఎం ప్రతాప్ అన్నారు. శనివారం రంగారెడ్డినగర్ డివిజన్ నందానగర్‌లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో గ్రీన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆకుపచ్చ రంగు దుస్తులతో సందడి చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రతాప్ మాట్లాడుతూ.. పర్యావరణ సమతుల్యతను పెంపొందించడంలో మొక్కలు ప్రముఖ పాత్రను పోషిస్తాయని, వాటి ప్రాముఖ్యతను వివరించేందుకు పాఠశాల యాజమాన్యం గ్రీన్‌డేను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మినీ అరవింద్, అకాడమిక్ డైరెక్టర్ అబ్దుల్ ఖయ్యూం, కరస్పాండెంట్ అశోక్, ఉపాధ్యాయులు పద్మజ, కృష్ణవేణి, రమ్యశ్రీ, జ్యోతి, మౌనిక, విజయలక్ష్మి పాల్గొన్నారు.

కేసుల విషయంపై నిర్లక్ష్యం తగదు

డీసీపీ కోటిరెడ్డి



మాట్లాడుతున్న మేడ్చల్ డీసీపీ

కుత్బుల్లాపూర్: కోర్టు పరిధిలో ఉన్న పోలీస్ కేసుల విషయంపై నిర్లక్ష్యం తగదని, ప్రతి కేసు విషయంపై సీఐలు అప్రమత్తంగా ఉండాలని మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి అన్నారు. పేట్ బషీరాబాద్ ఏసీపీ కార్యాలయంలో శనివారం అల్వాల్, శామీర్‌పేట్, జీనోమ్ వ్యాలీ, మేడ్చల్ ,సూరారం, దుండిగల్ సిఐలతో పాటు కోర్టు వ్యవహారాలు చూసే సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. డివిజన్ పరిధిలో ఉన్న సుమారు రెండు వేలకు పైగా కేసుల విషయంపై ఆరా తీశారు. ఎప్పటికప్పుడు వారెంట్లను జారీ చేస్తూ సీఐలను అప్రమత్తం చేయాలని దొంగతనం చేసి జైలు నుంచి విడుదలైన దొంగలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. కోర్టు కేసుల విషయంలో ఎవరూ అశ్రద్ధ వహించొద్దని తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ నరసింహారెడ్డి, ఏసీపీలు రాములు, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్రమ, పట్టుదలతో కార్యసిద్ధి

చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



సభలో మాట్లాడుతున్న చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

హఫీజ్‌పేట్: శ్రమ, పట్టుదలతోనే సాధ్యం కానీ గొప్ప గొప్ప పనులు సుసాధ్యం అయ్యాయని చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. భారతదేశ ఖ్యాతిని పెంపొందించడానికి ప్రధానమంత్రి నరేంద్రమోడీ నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. శనివారం చందానగర్ క్రిస్టల్ గార్డెన్స్‌లో రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సమావేశం, శేరిలింగంపల్లి నియోజకవర్గ కృతజ్ఞత సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి, శేరిలింగంపల్లి నియోజకవర్గ కంటెస్టెంట్ ఎమ్మెల్యే అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ జెండాను ఆవిష్కరించి విశ్వేశ్వర్‌రెడ్డిని సన్మానించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ తనను భారీ మెజార్టీతో గెలిపించిన శేరిలింగంపల్లి ప్రజలకు, నాయకులకు, కార్యకర్తలకు సభాముఖంగా కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి, రవికుమార్ యాదవ్‌లు మాట్లాడుతూ రానున్న పంచాయతీ, జీహెచ్‌ఎంసీ ఎన్నికలలో అందరూ కలిసికట్టుగా పని చేస్తే వంద శాతం విజయం సాధిస్తామన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ రాఘవేంద్రరావు, కో కన్వీనర్ మణిభూషణ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవీంద్రరావు, శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, నరేష్, నరేందర్‌రెడ్డి, ప్రేమ్ మహేందర్‌రెడ్డి, పవన్, అశోక్ ,మహిళా మోర్చా, యువ మోర్చా, డివిజన్ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

కుట్టు మెషిన్ల అందజేత



కుట్టు మెషిన్లు పంపిణీ చేసిన శేఖర్ యాదవ్

జగద్గిరిగుట్ట : స్వయం ఉపాధితో మహిళలు ఉన్నత స్థాయికి చేరుకుంటున్నారని కుత్బుల్లాపూర్ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ జేకే శేఖర్ యాదవ్ అన్నారు. జగద్గిరిగుట్టలోని జగద్గిరినగర్ కమ్యూనిటీ హాల్లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో స్లం సమైక్య గ్రూప్‌కి మూడు కుట్టు మెషిన్లను శేఖర్ యాదవ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో గాజులరామారం సర్కిల్ పీఓ హరిప్రియ, సీఓ కిషోర్, ఆర్‌పీ అనురాధ, స్లం సమైక్య గ్రూప్ అధ్యక్షురాలు వరలక్ష్మి, సుజాత, విజయ్ రెడ్డి, వెంకటమ్మ, విజయ రాణి పాల్గొన్నారు.

ఘనంగా వేదవ్యాస మహర్షి జయంతి



విద్యానాథ్‌ను సన్మానిస్తున్న వెంకటేష్ ముదిరాజ్

సుభాష్‌నగర్: వన వాన్మాయానికి ఆది గురువు భారతీయ సంస్కృతి సాంప్రదాయాలకు మూలకర్త వేదవ్యాస మహర్షి అని నార్త్‌సిటీ హైస్కూల్ ప్రిన్సిపాల్ కోల వెంకటేష్ ముదిరాజ్ అన్నారు. సూరారం నార్త్‌సిటీ హైస్కూల్‌లో ఒకరోజు ముందే శనివారం వేదవ్యాస మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ విశ్రాంత ఉపాధ్యాయుడు విద్యానాథ్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ.. చతుర్వేదాల ద్వారా విజ్ఞానాన్ని అందించి, ధర్మ బోధన చేసిన గొప్ప వ్యక్తి వేద వ్యాసుడని ఆయన అందించిన జ్ఞానాన్ని భావితరాల వారు నేర్చుకోవాలన్నారు.

అలరించిన ఆంధ్రనాట్యం



మాదాపూర్: కళాకారులు సంకీర్తనలతో, ఆంధ్రనాట్యంతో సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో శనివారం గురుపూర్ణిమ వేడుకలను నిర్వహించారు. అన్నమాచార్య భావన వాహిని శిష్యబృందం ధన్యోస్మి, పద్మశ్రీ, అక్షయ, అశ్రిత, పూర్వజ్, నారాయణి, మారుతి, విజయలక్ష్మి, శశికళ, అంబిక, సాయి రన్వితరెడ్డిలు సంకీర్తలను ఆలపించారు కీబోర్డు రాజు, తబలాపై నోవా వాయిద్య సహకారాన్ని అందించారు. శ్రీభాస్కర్ డ్యాన్స్ అకాడమీ గురువు సాత్విక శిష్యబృందం లక్ష్మీప్రణతి, శ్రీహిత, ధనిష్క, జాహ్నవి, హాసిని, శరణ్య, తనుశ్రీ, నవ్య, షన్విక సంయుక్తంగా శివోహం, గురుఅష్టకం, దశావతారం, శబ్దం (ఆంధ్రనాట్యం) కీర్తనలకు నృత్యరూపకంతో అలరించారు. అనంతరం డాక్టర్ శోభరాజు తమ సందేశాన్ని అందించారు. సత్సంకల్ప ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్రీధర్ తాళ్ళపాక ముఖ్య అతిథిగా పాల్గొని కళాకారులకు జ్ఞాపికలను అందజేశారు.